నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 6 మార్చి 2024 | NALGONDA

దామరచర్ల మండలం నర్సాపురంలో జీవాలకు మేతగా మారిన వరిపంట

పంటల్లేవ్.. పనుల్లేవ్

- నీళ్లు లేక ఎండుతున్న పంటలు
- సాగర్ ఆయకట్టులో గడ్డు పరిస్థితులు
- పనుల కోసం ఆంధ్రాకు తరలివెళ్తున్న రైతు కూలీలు

దామరచర్ల, మార్చి 5 : నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు పంటలు నష్టపోయి ఆర్థికంగా చితికిపోతున్నారు. పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. యాసంగిలో సాగు చేసిన పంటలు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. దాంతో రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోగా రైతు కూలీలకు పనులు లేకుండా పోయాయి. దాంతో ఆంధ్రా, ఇతర ప్రాంతాలకు పనుల కోసం వెళ్లే దుస్థితి దాపురించింది.

8వేల ఎకరాల్లో ఎండిన వరి పంటలు

దామరచర్ల మండలంలో యాసంగిలో బోర్లకింద వరి, పత్తి, మిర్చి, జొన్న పంటలు వేశారు. పంటలు చేతికొచ్చే సమయానికి భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయడం లేదు. దాంతో కొంత మంది రైతులు అప్పులు చేసి కొత్తగా బోర్లు వేస్తున్నారు. 400 ఫీట్లు వేసినా నీళ్లు పడటం లేదు. మండలంలోని దామరచర్ల, నర్సాపురం, బొత్తలపాలెం, కల్లేపల్లి, తిమ్మాపురం, వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం, ఇర్కిగూడెం, వాడపల్లి, కేశవాపురం పరిసర గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. మండలంలో బోర్లకింద 9వేల ఎకరాలు వరిసాగు చేయగా వెయ్యి ఎకరాల్లో మాత్రమే పంట చేతికందే అవకాశం ఉన్నది. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. నీళ్లు లేక ఎండిన వరి పంటను చేసేదేమీ లేక పశువుల మేతకు ఇచ్చేస్తున్నారు. పత్తి, మిర్చి, జొన్న పంటలు కూడా ఎండిపోయాయి. బత్తాయి, ఆయిల్ పామ్ తోటలకు నీరులేక పోవడడంతో ట్యాంకర్లతో నీటిని అందించి కాపాడుకుంటున్నారు. ఎండాకాలం ప్రారంభంలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూలీలుగా మారుతున్న రైతులు

దామరచర్ల మండలంలో పంటలు ఎండిపోవడంతో స్థానికంగా రైతులకు పనులు లేకుండా పోయాయి. దాంతో ఆంధ్రాలో పత్తి, మిర్చి పంట ఏరేందుకు కూలీలుగా వెళ్తున్నారు. మండలం నుంచే కాకుండా నిడమనూరు, త్రిపురారం, వేములపల్లి, మిర్యాలగూడ పరిసర ప్రాంతాల నుంచి నిత్యం ఆటోలు, డీసీఎంలలో వెళ్తున్నారు. గతంలో వర్షాలు సమయానికి పడి, చెరువుల్లో నీరు ఉండటంతో రెండుకార్లు పంటలు మంచిగా పండేవి. రైతులు, రైతు కూలీలకు స్థానికంగానే పనులు ఉండేవి. ప్రస్తుతం కరువు కారణంగా కూలి కోసం రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. గతంలో ఎన్నడూ వెళ్లని రైతులు, కూలీలు నేడు ఆర్థిక పరిస్థితులు బాగాలేక కూలికి వెళ్తున్నట్లు తెలిపారు.

పనుల కోసం ఆటోల్లో ఆంధ్రాకు తరలివెళ్తున్న వ్యవసాయ కూలీలు

కంబాలపల్లిలో వైద్య శిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చందంపేట, మార్చి 5 : గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కంబాలపల్లిలో మంగళవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ముత్యాల సర్వయ్య కుమారుడు ముత్యాల వెంకటేశ్, తల్లి ముత్యాల లక్ష్మమ్మ జ్ఞాపకార్థం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయనతోపాటు దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. మండలంలోని కంబాలపల్లి, పాత కంబాలపల్లి, రేకులవలయం, పొగిళ్ల, ఉస్మాన్‌కుంట, యల్మలమంద గ్రామాలకు చెందిన ప్రజలు శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ముత్యాల సర్వయ్య, టీవీఎన్ రెడ్డి, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, ముత్యాల చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రాములమ్మ, పరమేశ్ యాదవ్, అనంతగిరి, మల్లారెడ్డి, వడ్త్య బాలు, లయన్స్ క్లబ్ సభ్యులు వనం భిక్షమయ్య, గాజుల రాజేశ్, జంగయ్య, ప్రభాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చెక్ పవర్ లేని ప్రత్యేకాధికారులు

- నిధులు ఉన్నా వినియోగించలేని పరిస్థితి
- పంచాయతీల పాలకవర్గం ముగిసి నెలరోజులు గడిచినా కల్పించని ప్రభుత్వం
- అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులకు ఇబ్బందులు

సూర్యాపేట, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీల పాలకవర్గం పదవీ కాలం ముగిసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేక ప్రత్యేకాధికారుల పాలనను అమల్లోకి తెచ్చింది. కానీ నెల రోజులు గడిచినా అధికారులకు చెక్ పవర్ ఇవ్వలేదు. ప్రతి నిత్యం గ్రామ పంచాయతీల్లో పాలనాపరమైన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉండగా నిధులు డ్రా చేసే అవకాశం లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చిన్నచిన్న సమస్యలను పరిష్కరించేందుకు కూడా నిధులు వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయింది.

ఈ ఏడాది జనవరితో గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పాలన ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేకాధికారులను నియమించింది. ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక పాలనను కొనసాగిస్తున్నది. సూర్యాపేట జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉండగా 236 మంది స్పెషల్ ఆఫీసర్లను కేటాయించింది. గెజిటెడ్ అధికారుల కొరత కారణంగా ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీల బాధ్యతలను అప్పగించింది. ప్రత్యేకాధికారి, గ్రామ పంచాయతీ కార్యదర్శికి కలిపి జాయింట్ చెక్ పవర్ కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. దాంతో వారు గత పాలకవర్గాల నుంచి రికార్డులు, చెక్ బుక్కులు, డిజిటల్ సంతకాల కీలను వెంటనే స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమై నెల రోజులు దాటినప్పటికీ ప్రభుత్వం చెక్ పవర్ కల్పించడంలో తాత్సారం చేస్తున్నట్లు కనిపిస్తున్నది.

చిన్న సమస్యలకు కూడా ఇబ్బందులే..

ప్రత్యేక అధికారులకు ప్రభుత్వం చెక్ పవర్ ఇవ్వకపోవడంతో గ్రామాల్లో చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కూడా నిధుల కొరత తప్పడం లేదు. పంచాయతీల్లో అభివృద్ధి, ఇతర కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రతి నెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఫైనాన్స్ కార్పొరేషన్ కింద పీఎఫ్ఎంఎస్, ఎస్ఎఫ్సీ, జనరల్ ఫండ్ విడుదల చేస్తున్నాయి. వీటిని గతంలో సర్పంచులు, ఉప సర్పంచులు వారి చెక్ పవర్ ద్వారా అవసరం మేరకు వినియోగించుకునేవారు. ప్రస్తుతం ఆ చెక్ పవర్‌ను ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఇంకా ఇవ్వకపోవడంతో పాలనా పరంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీల్లో ట్రాక్టర్ సాయంతో పారిశుధ్య చర్యలు చేపట్టడం, బ్లీచింగ్ పౌడర్, తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్, మోటర్ల మరమ్మతులు, వీధిలైట్లకు సంబంధించిన పనులకు అధికారులు సొంతంగా డబ్బులు వెచ్చించడమో లేక డబ్బులు తర్వాత ఇస్తామని చెప్పి పనులు చేయించాల్సి వస్తున్నది. విద్యుత్ బిల్లులు, సిబ్బంది వేతనాలతోపాటు ట్రాక్టర్లకు ఈఎంఐలు కూడా చెల్లించాల్సి ఉన్నది. ఇవన్నీ అత్యవసరం కాగా, చెక్ పవర్ లేని కారణంగా పంచాయతీ అధికారులకు బిల్లుల చెల్లింపు తలనొప్పి వ్యవహారంగా మారింది. ఇది పంచాయతీల్లో అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇబ్బంది కాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నది.

విత్తనాల విక్రయానికి డీలర్‌షిప్‌నకు ఆహ్వానం

మిర్యాలగూడ రూరల్, మార్చి 5 : మండలం నందిపహాడ్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యమైన విత్తనాలను విక్రయించేందుకు లైసెన్స్ కలిగి ఆసక్తి ఉన్న వ్యాపారులను డీలర్‌షిప్‌నకు ఆహ్వానిస్తున్నట్లు విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో లైసెన్స్ కలిగిన వ్యాపారస్తులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9849908747 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నీలగిరి, మార్చి 5 : రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో గ్రూప్-1 ప్రిలిమ్స్, ఇతర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం ఈ నెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి.విజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 45 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ విద్యార్థులు దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494345471, 7981196060 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎల్ఆర్ఎస్ చార్జీలపై బీఆర్ఎస్ గరం

కాంగ్రెస్ సర్కార్ తీరుపై తీవ్ర ఆగ్రహం

- గతంలో ఉచితమని.. ఇప్పుడు చార్జీలు వసూలా..?
- కాంగ్రెస్ నేతల ద్వంద్వ వైఖరిని ఎండగట్టేందుకు సిద్ధం
- నేడు నియోజకవర్గాల్లో ఆందోళనకు బీఆర్ఎస్ సన్నద్ధం

నల్లగొండ ప్రతినిధి, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)పై కాంగ్రెస్ సర్కార్ మోసపూరిత వైఖరిని ఎండగట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలంటూ డిమాండ్ చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు అధికారంలోకి రాగానే ప్రజల నడ్డి విరిచేందుకు సిద్ధం కావడం పట్ల బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. కాంగ్రెస్ సర్కార్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టేందుకు దశల వారీ ఆందోళనలకు సన్నద్ధమవుతున్నది. ఈ క్రమంలో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ధర్నాలకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నేడు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనుంది.

గతంలో బీఆర్ఎస్ సర్కార్ ఎల్ఆర్ఎస్‌ను తీసుకొచ్చినప్పుడు అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలు అనధికారిక లేఅవుట్‌లోని ప్లాట్లను ఉచితంగానే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి రాగానే ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండానే రెగ్యులరైజ్ చేస్తామని కూడా ప్రకటించారు. అంతటితో ఆగకుండా జిల్లాకు చెందిన ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అప్పట్లో ఎల్ఆర్ఎస్‌పై కోర్టులో కేసు వేసి అడ్డుకున్నారు. కానీ.. నేడు అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు నాలుక మడతేశారు. ప్రభుత్వ ఖజానాను నింపుకొనేందుకు ఎల్ఆర్ఎస్ అమలుకు సిద్ధమవుతూ చార్జీల వసూలుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇటీవలే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను నివేదిక కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2.54లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి.

అనధికారిక లేఅవుట్లు, ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకుని క్రమబద్ధీకరణ కాకుండా ఇబ్బందులు పడుతున్న వారి కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ స్కీమ్‌లను తీసుకొచ్చింది. 2015లోనే కేసీఆర్ సర్కార్ 20వేల దరఖాస్తులను పరిష్కరించింది. ఆ తర్వాత కూడా ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటి కోసం 2020 ఆగస్టు నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించింది. దీన్ని ముందుకు పడకుండా అప్పట్లోనే కాంగ్రెస్ నేతలు అడుగడుగునా కుట్రలు చేశారు. కోర్టుల్లో కేసులు వేసి ఎల్ఆర్ఎస్ అమలు కాకుండా అడ్డుకున్నారు. దీంతో అప్పటి ప్రభుత్వం కూడా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పక్కన పెట్టక తప్పలేదు. కాగా, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ వనరులను సమీకరించుకోవడం కోసం ఎల్ఆర్ఎస్‌ను ఆయుధంగా వాడుకోవాలని భావిస్తున్నది. ఇన్నాళ్లూ అడ్డంకులు సృష్టించి ఇప్పుడేమో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు సిద్ధపడింది. రాష్ట్ర వ్యాప్తంగా 25లక్షల దరఖాస్తుదారుల నుంచి సుమారు రూ.20వేల కోట్ల ఆదాయాన్ని ఆశిస్తూ ప్రజల జేబుకు చిల్లు పెట్టే పనిలో పడింది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ కోసం రెట్టింపు చార్జీలు వసూలు చేయనున్నారు. సాధారణంగా రిజిస్ట్రేషన్ కోసం మార్కెట్ విలువలో 7.5 శాతం రుసుంను స్టాంప్ డ్యూటీగా వసూలు చేస్తుంటారు. కానీ.. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ పేరుతో 14శాతం స్టాంప్ డ్యూటీగా కట్టించుకోనున్నట్లు సమాచారం. ఇదే జరిగితే ఒక్కో దరఖాస్తుదారుడిపై సగటున లక్ష రూపాయల భారం అనుకున్నా.. ఉమ్మడి జిల్లాలో రూ.2,540 కోట్లు వసూలు చేయనున్నారు. అప్పుడు ఉచితమని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు కూడా ఉచితంగానే అమలు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నది. అందులో భాగంగానే నేడు ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలకు సిద్ధమైంది. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ ధర్నాలు చేపట్టనున్నారు. ఉదయం 11 గంటల నుంచి ఈ ధర్నాలు ప్రారంభం అవుతాయని, దరఖాస్తుదారులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో రావాలని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. రేపు జిల్లా కలెక్టర్లకు, ఆర్డీఓలకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

నేటి బీఆర్ఎస్ ధర్నాను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, మల్లయ్యయాదవ్

మిర్యాలగూడ/కోదాడ/చందంపేట (దేవరకొండ) : ఎన్నికల ముందు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా ఇవ్వాలన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రుసుం విధించడాన్ని ఖండిస్తూ దేవరకొండలో బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. కోదాడలో నిర్వహించనున్న ధర్నాకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. ఎల్ఆర్ఎస్ చార్జీలపై, సాగర్ కాల్వకు నీళ్లివ్వని ప్రభుత్వ వైఖరిపై మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

- యాదగిరిగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వస్తివాచన పూజలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వస్తివాచనం కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు

యాదగిరిగుట్ట, మార్చి5 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి అనుబంధమైన పర్వతవర్ధినీ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు ఉదయం 11.30 గంటలకు స్వస్తివాచనంతో శ్రీకారం చుట్టారు. స్వస్తివాచనంతో లోకంలోని సర్వవిఘ్నాలు, సర్వవిధ దోషాలు తొలగి ఈశ్వర అనుగ్రహం కలుగాలని, శైవాగమ సంప్రదాయ రీతిలో ఈ వేడుకను జరిపించారు. అనంతరం విఘ్నేశ్వర ఆరాధన చేశారు. వేదమంత్ర పఠనంతో పవిత్ర జలం, పూజ ద్రవ్యాలను ఆలయ పరిసర ప్రాంతంలో ప్రోక్షణ గావించి శుద్ధి పుణ్యాహవాచన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాలు పరమేశ్వర అనుగ్రహంతో సక్రమంగా నిర్వహింపబడాలని శాస్త్రోక్తంగా రక్ష బంధనాలు , పూజాధికాలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, భక్తులకు రక్షబంధనాలను యాజ్ఞికులు, ఆలయ అర్చకులు ధరింపజేశారు.

అంకురారోపణం

ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం పారాయణికులు నమక, చమక పారాయణాలు, మంత్రపుష్ప పఠనం, అంకురారోపణం, సోమ కుంభ, కలశస్థాపన, దేవతారాధన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓలు రమేశ్ బాబు, శ్రవణ్‌కుమార్, ప్రధాన పురోహితులు సత్యనారాయణ శర్మ, శివాలయ ప్రధానార్చకులు నరసింహరాముల శర్మ, ఆలయ అధికారులు చంద్రమౌళి పాల్గొన్నారు.

నేడు దేవతాహ్వానం..

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ధ్వజ పటారోహణం, భేరీ పూజ, దేవతాహ్వానం, అగ్ని ప్రతిష్ఠ వంటి పూజలు నిర్వహించనున్నారు.

పారువేటలో పాల్గొన్న భక్తులు

కనులపండువగా పారువేట

- అశ్వ వాహనంపై యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఊరేగింపు
- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

అశ్వ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు

అర్వపల్లి, మార్చి 5 : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అర్వపల్లి యోగానంద లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పారు వేట కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 15 రోజులపాటు ప్రతి రోజు జరిగిన ఒక ఉత్సవంలో అలిసి నారసింహుడు అమ్మవార్లు శ్రీదేవి, భూదేవితో కలిసి విశ్రాంతి కోసం అశ్వ వాహనంపై ఊరేగింపుగా వేటకు బయల్దేరారు. ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి అటవీ ప్రాంతంలో వేటను ముగించుకొని తిరిగి రాత్రి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. సోమవారం అర్ధరాత్రి దేవరాజ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నటరాజ కళా బృందం నిర్వహించిన కొమ్ము కోయ, ఒగ్గు కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నరసింహస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి వేషధారణలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచార్యులు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ధర్మకర్తలు రత్నం లక్ష్మాజీ, కృష్ణమూర్తి, రేణుక, సోమయ్య, నాయకులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాస్

నీలగిరి,మార్చి 5 :2023-24 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం తన చాంబర్‌లో ధాన్యం కొనుగోలు కార్యాచరణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాసంగిలో అధిక ధాన్యం దిగుమతి అయ్యేందుకు అవకాశం ఉన్నందున అందుకు తగినట్లుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పీఏసీఎస్, ఐకేపీ అధికారులను ఆదేశించారు. ముఖ్యం గా అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని అందుకు అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రేడ్-ఏ ధాన్యం రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ నాగేశ్వర్‌రావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ, మిల్లర్లు నారాయణ, శ్రీనివాస్, పెద్దయ్య పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ సతీష్ వర్మ ఎస్పీ కార్యాలయానికి అటాచ్

మిర్యాలగూడ రూరల్, మార్చి 5 : మిర్యాలగూడ రూరల్ ఎస్ఐగా పని చేస్తున్న సతీశ్ వర్మ పలు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఎస్పీ చందనాదీప్తి జిల్లా కార్యాలయానికి అటాచ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణాకు కొమ్ముకాస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారణ జరిపి ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నట్లు తెలిసింది.

మేళ్లచెర్వు జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ లత

జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ లత

మేళ్లచెర్వు, మార్చి 5 : మేళ్లచెర్వులో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగే మహా శివరాత్రి జాతరకు ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లత అన్నారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి పలు శాఖల అధికారులు, నాయకులతో జాతర ఏర్పాట్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్యూ లైన్లు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణపై శ్రద్ధ వహించాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జాతర సమయంలో లిఫ్ట్ ద్వారా గ్రామ శివారులోని ఎన్ఎస్పీ కాల్వలోకి నీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ఆమె సూచించారు. అనంతరం ఆలయ పరిసరాలలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కోటాచలం, ఎంపీపీ కొట్టె పద్మావెదేశ్వర్‌రావు, తాసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ ఖాజా అజ్గర్ అలీ, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ పరమేశ్, ఈఓ కొండారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, నాయకులు శాగంరెడ్డి గోవిందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.